చిన్నకథ

# గుప్పెడు మనసు

'లతా' అని పిలుపు వినబడగానే తను చదువుతున్న 'ఆంధ్రజ్యోతి' తెలుగు దిన పత్రిక నుంచి దృష్టిని మరల్చి మధులత చూసింది. ఆమె విజయవాడలో ఒక ట్రేయిన్ కంపార్ట్‌మెంట్‌లో కూర్చుని వుంది. అప్పుడే సుధారాణి ఆ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కింది. మధులత, సుధారాణి కాలేజీలో కల్సి చదివారు. చాలా కాలం తరువాత ఇప్పుడు కల్సుకున్నారు.

"హాయ్, సుధా, ఎక్కడికీ ప్రయాణం? ఏంటి విశేషాలు?"

"ఇక్కడ విజయవాడలో బంధువుల ఇంట్లో ఒక ఫంక్షన్‌కు హాజరై రాజమండ్రికి తిరిగి వెళ్తున్నాను. అక్కడ మా శ్రీవారు ఆంధ్ర బ్యాంకులో పనిచేస్తున్నారు. నీ సంగతి చెప్పు" అంది సుధా.

"తాడేపల్లిగూడెంలో మా పుట్టింటి వాళ్లని చూసివద్దామని వెళ్తున్నాను. ఇక్కడ విజయవాడలో మా ఆయన కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. అది సరే, నీకు ఈ పాప ఒక్కతేనా, ఇంకా పాపలు, బాబులు వున్నారా?" లత సుధాతో కూడా వున్న ఒక పాపను దగ్గరకు తీసుకుంటూ అడిగింది. రైలు కదిలింది.

"ఏం చెప్పమంటావ్. ఇది పాపకాదు. బాబు" అంది నిట్టూరుస్తూ సుధా.

"అదేలా?" ఆశ్చర్యంగా అడిగింది లత.

"నాకు మొదట ఒక పాప పుట్టింది. అది పుట్టిన రెండేళ్లకు ఈ బాబు పుట్టాడు. వాడు పుట్టిన కొద్ది రోజుల్లో పాపకు టైఫాయిడ్ జ్వరం వచ్చిచనిపోయింది." అని కంటతడి పెట్టింది సుధా.

"మళ్లీ మరొక పాపను కంటావులే పోయిన పాప కోసం బెంగపెట్టుకోకు" అని ఓదారుస్తూ అంది లత.

"దాన్ని గురించిన బెంగ క్రమక్రమంగా తగ్గించుకుంటున్నాను. కాని దాని రెండేళ్ల జ్ఞాపకాలు నా మనసులో నిండివున్నాయి. నా తృప్తి కోసం ఈ బాబుకి ఆ పాప దుస్తులు వేసి వాడిని ఆ పాపలాగానే చూసుకుంటున్నాను." రైలు ఏలూరు చేరింది. అప్పుడు ఒక పన్నెండేళ్ల అమ్మాయి లత దగ్గరకు వచ్చి "మేం ఏలూరులో దిగిపోతున్నాం. మీ బాబును తీసుకోండి. చాలా -2- ముద్దుగా వచ్చీరాని మాటలతో మాకు కబుర్లు చెప్పి మంచి కాలక్షేపం ఇచ్చాడు" అని బాబుని ఒక సారి ముద్దుపెట్టుకుని లత చేతికందించింది. వెంటనే ఆ బాబును సుధా తీసుకుని ముద్దాడి,

"నీ బాబు చాలా బాగున్నాడే ఇంకా బాబులు, పాపలు వున్నారా?" అని ఆసక్తితో అడిగింది.

"నీది ఒక రకమైన సమస్య అయితే, దానికి వ్యతిరేక సమస్యనాది" అని నిర్జీవంగా నవ్వింది లత.

"నా సమస్య చెప్పాను కదా! నీ సమస్య నాకు వివరంగా చెప్పు" అంది సుధా.

"నాకు మొదట పాప పుట్టింది. కాని నాకు రెండవ సారి డెలివరీ అయితే నా ప్రాణానికే ప్రమాదమని నా గర్భసంచి తీసి వేశారు. కాని నాకు ఒక బాబు కూడా కావాలని వుంది. అందుకని ఈ పాపకు బాబు దుస్తులు వేసి చూసుకుంటూ కొంచెం తృప్తి పడుతున్నాను"

"నువ్వు నీ పాపను బాబు దుస్తుల్లో చూసుకుని తృప్తిపడుతుంటే నేను నా బాబుని పాప దుస్తుల్లో చూసుకుని మనసును స్థిమిత పర్చుకుంటున్నాను. ఈ పరిస్థితులలో మనిద్దరికి కొంచం వేదాంత ధోరణి అవసరమనిపిస్తోంది. అదే మన సమస్యలకు పరిష్కారం"

"ఏమిటే ఆ వేదాంత పరిష్కారం?" నవ్వుతూ అడిగింది లత.

"వాస్తవంలో ఉన్న దానితో తృప్తి పడనీయకుండా లేనిదానికోసం శాంతం లేకుండా పాకులాడేటట్లుగా మనిద్దరిలోనూ ప్రేరేపిస్తున్నది ఈ గుప్పెడు మనసు"

సుధామాటలు లత హృదయాన్ని తాకాయి.

"నువ్వు చెప్పింది నూటికి నూరు పాళ్లు నిజమే" అంది లత. ఆ క్షణంలో ఇద్దరి మనసులు తేలిక పడ్డాయి. కాకతాళీయంగా అప్పుడే "మౌనమే నీ భాష ఓ మూగ మనసా.... ఉన్నది వదిలేవు, లేనిది కోరేవు, మాయల దయ్యానివే మనసా" అని మంగళంపల్లి బాలమురళీ కృష్ణ 'గుప్పెడు మనసు' సినిమాలో ప్లే బ్యాక్‌లో పాడిన పాట ఆ కంపార్ట్‌మెంట్‌లో ఒక ప్రయాణీకుడి ట్రాన్సిస్టర్‌లో నుంచి వినబడింది. స్నేహితురాళ్లిద్దరు తమ సమస్యలకు స్వస్తి చెప్పి, హాయిగా కాలేజి కబుర్లతో ప్రయాణం సాగించారు.



- కె. శ్రీనివాస శాస్త్రి